క్లుప్తంగా

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ధర్నా


మాట్లాడుతున్న కాలనీవాసులు

సంగారెడ్డి: ప్రభుత్వ భూమిని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని సంగారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 8వ వార్డుకు చెందిన ప్రజలు శనివారం ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎనిమిదో వార్డు, సంజీవనగర్‌లో 800 గజాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ స్థలం కన్నేసి అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ మాట్లాడుతూ 1959లో నీలం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కాలనీ ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించినట్లు గుర్తు చేశారు. మెయిన్ రోడ్డుకు పక్కనే ఖాళీ స్థలం ఉండడంతో కొంతమంది కబ్జాదారుల కన్ను పడిందన్నారు. దీంతో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

కంకర క్రషర్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి


కంకర క్రషర్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల పరిధిలోని మాదారం గ్రామ శివారులోని కంకర క్రషర్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కంకర క్రషర్ ఎదుట రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత, మాజీ వార్డుసభ్యుడు రాజుగౌడ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా కంకర క్రషర్‌ల యాజమాన్యాలు బ్లాస్టింగ్ చేపడుతుండటంతో సమీపంలోని పంట పొలాలపై దుమ్ముధూళి పేరుకుపోయి పంటలు పండటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులు లేకున్నా కంకర క్రషర్‌ల యాజమాన్యాలు బ్లాస్టింగ్‌లు చేపడుతున్నాయని మండిపడ్డారు. ఈ విషయమై అధికారులు స్పందించి కంకర క్రషర్ యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గీతం స్కాలర్ వసుధకు డాక్టరేట్


వసుధ

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మేనేజిమెంట్ విభాగం పరిశోధక విద్యార్థి వసుధను డాక్టరేట్ వరించింది. హైదరాబాద్ (తెలంగాణ)లోని ఐటీ సంస్థల్లో సంస్థ సుస్థిరతపై పర్యావరణ హిత మానవ వనరుల నిర్వహణ (జీహెచ్ఆర్ఎం) అభ్యాసాల ప్రభావంపై అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన ఈ పరిశోధనకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పార్వతి మార్గదర్శనం వహించింది. వసుధ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రేజింతల్‌కు దిండియాత్ర

నారాయణఖేడ్: న్యాల్‌కల్ మండల పరిధిలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయంలో 224వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వారీకార్ భక్తులు దిండియాత్రను నారాయణఖేడ్ నుంచి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వామన్‌రావు మహారాజ్ ఆధ్వర్యంలో కాశీనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు భజన, కీర్తనలు చేస్తూ తులసీకోటలు తలలపై ధరించి పాదయాత్రగా రేజింతల్‌కు బయలుదేరారు. వీరికి గ్రామగ్రామాన భక్తులు ఘన స్వాగతం పలుకుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకు రేజింతల్ చేరుకొని అక్కడ భజనలు, కీర్తనలు చేయనున్నట్లు వామన్‌రావు మహారాజ్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడిపై కత్తితో దాడి

మునిపల్లి(అందోల్): మునిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు సురేష్‌పై శనివారం గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. ఈ క్రమంలో సురేష్ చేతులు అడ్డం పెట్టడంతో చేతివేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సదాశివపేటకు చెందిన గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో తనపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పద్మశాలీల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


పద్మశాలీ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. పద్మశాలీ సంఘానికి సంబంధించిన 2024 సంవత్సరపు క్యాలెండర్‌ను ఆ సంఘం బాధ్యులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించేవిధంగా వారి అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. పద్మశాలీలు క్రమశిక్షణతో పాటు చక్కటి నేత నేయడంలో ప్రతిభ కలిగి ఉంటారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డితో పాటు డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం బాధ్యులు సంగయ్య, బషెట్టి, నర్సింహులు, శ్రీనివాస్, రాఘవులు, అనంతం, పండరి, కేశవులు, అంజయ్య, లక్ష్మీనారాయణ, యువజన విభాగం బాధ్యులు గోస్కె శ్రీనివాస్, గుండు శివ కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ ఆలయంలో పూజలు

నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ ఆలయాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నప్రసాద వితరణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- క్రికెట్ పోటీలు ప్రారంభం

పటాన్‌చెరు: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో నిర్వహించనున్న రుద్రారం ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించడంతో పాటు క్రీడారంగ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీలు మన్నె రాజు, హరిప్రసాద్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాండు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు టీషర్ట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

యూనియన్ జెండా తొలగింపుపై నిరసన

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని సూరెడ్డి ఇటిక్యాల గ్రామంలోని ఎంఎస్ డిస్టిలరీ కంపెనీలో కొందరు కార్మికులు శుక్రవారం హెచ్ఎంఎస్ యూనియన్‌ను ప్రారంభించి గేట్ ఎదుట జెండా ఆవిష్కరించారు. దీంతో జీర్ణించుకోలేని గుర్తు తెలియని వ్యక్తులు అదేరోజు రాత్రి హెచ్ఎంఎస్ జెండాను తొలగించారని ఆరోపిస్తూ ఆ సంఘానికి చెందిన కార్మికులు కర్మాగారం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ కొందరు కంపెనీ కాంట్రాక్టర్‌లే జెండాను తొలగించారని ఆరోపించారు. కంపెనీ గేట్ ముందు సీసీ కెమెరాలు పనిచేయకుండా చేసిన తర్వాతనే జెండాను తొలగించారని ఆరోపించారు. కార్మాగారంలో మహిళా కార్మికులు ఎక్కువగా ఉంటారని, వారి భద్రతకు యాజమాన్యం ఎలాంటి భద్రత చర్యలు తీసుకోవడంలేదని హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు వాపోయారు. మహిళా కార్మికుల భద్రతకు అంబులెన్స్, మెడికల్ ఆఫీసర్ ఉండటంలేదని ఆరోపించారు. హెచ్ఎంఎస్ సంఘం కార్మికులు చేపట్టిన నిరసనకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బాలయ్య, సురేందర్ తదితరులు మద్దతు తెలిపారు.

అక్రమ కట్టడాలను తొలగిస్తాం

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ లైన్‌లపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మార్క్‌నగర్ కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థను శనివారం పరిశీలించారు. డ్రైనేజీ లైన్‌పైన నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామన్నారు. అనంతరం శాంతినగర్‌లోని జాతీయ రహదారి పక్కన బజాజ్ షోరూమ్ ముందు ఉన్న డ్రైనేజీ లైన్ చెత్తతో నిండి ఉండటంతో గుర్తించిన కార్పొరేటర్ జెసీబీని పిలిపించి చెత్తను తొలగింపజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

నారాయణఖేడ్: మండల పరిధిలోని కొండాపూర్‌లోని హనుమాన్ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ప్రతి శనివారం ఖేడ్‌తో పాటు వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం విద్యాసంస్థలు, పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఉండటంతో పాటు రెండవ శనివారం కావడంతో భక్తుల సంఖ్య పెరిగింది. ఈ సందర్భంగా భక్తులు ఆలయ పీఠాధిపతి, అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్ ఆశీస్సులు పొందారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సిద్ధివినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కౌన్సిలర్ చంద్రారెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకురాలు ప్రత్యూష హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీన్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.


మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి, ప్రత్యూష

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

జహీరాబాద్ టౌన్: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ సర్కిల్ ఆధ్వర్యంలో మహిళా టీచర్లను ఘనంగా సన్మానించారు. జహీరాబాద్ పట్టణంలో సావిత్రిబాయి పూలే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముగుండంపల్లి వైద్యాధికారి డాక్టర్ సీతారామరాజు, వైద్యులు విజయలక్ష్మి, శివబాబు హాజరైయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మండల విద్యాధికారి శ్రీనివాస్ సర్కిల్ సెంటర్‌కు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులు రాంచందర్ భీంవంశీ, మొగులయ్య, అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, రవికాంత్, కోశాధికారి బిచ్చయ్య, ఉపాధ్యక్షుడు వెంకయ్య, కార్యవర్గ సభ్యులు విఠల్, బిచ్చయ్య, ముకుంద్, వసంత్, పాండు, అశోక్, సమత సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్, జిల్లా అధ్యక్షుడు కరణం రవికుమార్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు లక్ష్మీకాంత్, మచ్చెందర్, రాజు కుమార్, గోపాల్ పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ సర్కిల్ నాయకులు, వైద్యులు

మకరజ్యోతి ఉత్సవాలు ప్రారంభం


సదాశివపేట పట్టణంలోని అయ్యప్ప మందిరం

సదాశివపేట(సంగారెడ్డి): ఈ నెల 13వ తేదీ శనివారం నుంచి 15వరకు నిర్వహించనున్న అయ్యప్ప స్వామి మకరజ్యోతి ఉత్సవాలను మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ తదితరులు శనివారం ఘనంగా ప్రారంభించారు. పట్టణంలోని పాతపేరుమాళ్ల హనుమాన్ మందిరం సమీపంలో దాతల సహకారంతో ఎకరం స్థలంలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి మందిరాన్ని నిర్మించారు. మందిరంలో 18 మెట్లు నిర్మించి వాటిని పంచలోహం పూతతో అలంకరించారు. ఆలయం ప్రాంగణంలో వినాయక, కుమారస్వామి, నాగదేవత, సంతోషిమాత మందిరాలతో పాటు నవగ్రహాలను ప్రతిష్ఠించారు. దాతల సహకారంతో దాదాపు కోటి రూపాయలతో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో స్వామివారి అలంకరణకు స్వర్ణాభరణాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. సదాశివపేట పట్టణంలో 2008 నుంచి మకరజ్యోతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులు కోరారు.

నర్సింహస్వామి ఆలయంలో భక్తుల సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వెంకటేశ్వర దీక్షాపరులు, భక్తులు ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ ఆధ్వర్యంలో బీదర్ సమీపంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో యజ్ఞాలు, పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆదిలక్ష్మి ఆశ్రమం నుంచి పాదయాత్రన బయలుదేరినవారు రాత్రికి అక్కడకు చేరుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారంయజ్ఞాలు నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్

జోగిపేట (అందోల్): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జన్మదినం సందర్భంగా జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు, పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్, ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రమేష్, జిల్లా లయన్స్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ అనంతరెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్యం, సేవా కార్యక్రమాల్లో జోగిపేట లయన్స్ క్లబ్ ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, కంటి చికిత్సలు, విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేయడం పట్ల క్లబ్ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ చైర్‌పర్సన్ రాంబాబు లయన్స్ క్లబ్ మాజీ జోన్ చైర్మన్ ముద్దాయిపేట విజయ్‌కుమార్, క్లబ్ సెక్రెటరీ అల్లే శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ సెక్రెటరీ సంతోష్‌కుమార్, సభ్యులు డాక్టర్ జాన్‌పాల్, సంతోష్, మల్లేశం, కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఆస్పత్రి కాంట్రాక్టర్ నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

లారీ ఓనర్స్, డ్రైవర్ల నిరసన

సదాశివపేట(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత 106(2) హెచ్‌ఐటీ, రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సదాశివపేట పట్టణంలో లారీఓనర్లు, డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లారీఓనర్స్ అసోసియేషన్ నాయకులు ల్యాకత్, మోయుద్దిన్, అనిల్‌రెడ్డి, లారీఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న లారీ ఓనర్లు, డ్రైవర్లు

ఊర్లకు వెళ్తే సమాచారం ఇవ్వండి

పటాన్‌చెరు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంత ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, విలువైన వస్తువులు మీ వెంటగాని, బ్యాంకుల్లో గాని భద్రపరచాలని పటాన్‌చెరు క్రైమ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సొంత ఊర్లకు వెళ్లేవారు తమ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను ఆఫ్ చేయకూడదని, ఇంటి పక్కనే ఉండే వారికి తమ ఇంటి వైపు అప్పుడప్పుడు చూస్తూ ఉండాలని చెప్పి వెళ్లాలని సూచించారు. కాలనీలలో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు కాల్ చేయాలని లేదా స్థానికంగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జోగిపేట(అందోల్): సంక్రాంతిని పురస్కరించుకుని సొంత గ్రామాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండగ దష్ట్యా చోరీల నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊర్లేవారు తమ ప్రయాణ వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయొద్దని సూచించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. లేదా 8712656753 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

కంది(సంగారెడ్డి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని ఇంద్రకరణ్‌లో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే విధంగా ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి, సర్పంచ్ వేణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం, ఇస్నాపూర్ గ్రామాల్లో సర్పంచ్ దండు నర్సింహులు, గడ్డం బాలమణి, ఎంపీటీసీ శ్రీశైలం ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ముత్తంగి గ్రామంలో మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన మహిళలకు సర్పంచ్ దండు నర్సింహులు బహుమతులను ప్రదానం చేశారు. అదేవిధంగా ఇస్నాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ గడ్డంబాలమని ఎంపీటీసీ శ్రీశైలం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో...

సంక్రాంతిని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించే బ్యానర్లను ఏర్పాటు చేసి కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. తహసీల్దార్ భాస్కర్, నాయబ్ తహసీల్దారులు కార్తీక్, సంతోష్ కుమార్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కైట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న అధికారులు

జిన్నారంలో...

జిన్నారం(పటాన్‌చెరు): సంక్రాంతి సందర్భంగా ఆయా గ్రామాల్లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. మండలంలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలోని హెటిరో పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందినవారికి హెటిరో గ్రూపు సంస్థల చైర్మన్ పార్థసారధిరెడ్డి నగదు బహుమతులను ప్రదానం చేశారు. అదేవిధంగా గుమ్మడిదల మండలంలోని బొంతపల్లిలో సర్పంచ్ నవీన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందినవారికి ఎంపీపీ సద్ది ప్రవీణ బహుమతులను ప్రదానం చేశారు.


జిన్నారం: బొంతపల్లిలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంపీపీ ప్రవీణ


ముగ్గులను పరిశీలిస్తున్న హెటిరో గ్రూపు సంస్థల చైర్మన్ పార్థసారధిరెడ్డి

నేడు కిజర్‌యాపై గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీ ఫైనల్

జహీరాబాద్: పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో వారం రోజుల పాటు నుంచి కొనసాగుతున్న కిజర్‌యాపై గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీ ఈ నెల 14న నిర్వహించనున్నారు. ఫైనల్ పోటీలకు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ క్రికెటర్లు మునాఫ్ పటేల్, సురేష్ రైనా హాజరై విన్నర్, రన్నర్ జట్లకు కప్, నగదు పారితోషికం ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం జరిగిన సెమీ ఫైనల్ పోటీల్లో సంగారెడ్డికి చెందిన ధారాసింగ్ జట్టు, శేఖాపూర్‌కు చెందిన సీసీ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆల్‌రౌండర్ ప్రతిభ కనబర్చిన యుద్వీర్‌కు ప్రముఖ వ్యాపారి అల్లాడి వీరేశం గుప్తా, హెచ్‌సీఏ కార్యదర్శి ఫయాంలు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును అందజేశారు. ఫైనల్ విజేత జట్టుకు రూ.5,55,555 నగదు బహుమతి, రన్నర్ జట్టుకు రూ.3,33,333ల నగదు పారితోషికం అందజేయనున్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అధికార ప్రతినిధి రాములు నేతతో పాటు మోతిరాం, శ్రీనివాస్‌నాయక్, వాసునాయక్, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లి దుర్గమ్మ ఆలయంలో చోరీ

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని పోతిరెడ్డిపల్లి రోడ్డు పక్కన ఉన్న అమ్మవారి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి కానుకలు, నగదుతో గ్రామ ప్రధాన వీధి గుండా వికారాబాద్ జిల్లా మర్పల్లి వైపు పల్సర్ బైక్‌పై పారిపోవడం సీసీ ఫుటేజీలో నమోదు అయ్యింది. అమ్మవారి ఆలయాన్ని నాలుగేళ్ల క్రితం నిర్మించినట్లు, అప్పటి నుంచి హుండీ లెక్కింపు చేపట్టలేదని సర్పంచ్ దాసరి కిష్టప్ప తెలిపారు. హుండీలో పెద్ద మొత్తంలో నగదు ఉండి ఉంటుందన్నారు. గ్రామపెద్దల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీంను రప్పించి దర్యాప్తు చేపట్టారు.